

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,66,936లు, బంగారం 19గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 38గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మైనర్‌ బాలికపై లైంగిక దాడి

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఒక మైనర్‌ బాలికపై నలుగురు దుండగులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది.

- 8లో



టికెట్ల విక్రయంలో ఖుర్దారోడ్‌ టాప్‌

తూర్పు కోస్తా రైల్వేలో ఖుర్దారోడ్‌ మండలం టికెట్ల విక్రయంలో అధునాతన సౌకర్యాలతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.

- 8లో

న్యూస్‌రీల్‌

లక్ష్మీ బస్సు ప్రారంభం



లక్ష్మీబస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్‌: ప్రభుత్వ లక్ష్మీబస్సుని కాంగ్రెస్‌ పార్టీకి చెందిన కొరాపుట్‌ జిల్లా లక్ష్మీపూర్‌ ఎమ్మెల్యే పవిత్ర శాంత మంగళవారం ప్రారంభించారు. ఈ బస్సు ఒడియా పెంట, పంచడ, కక్కిరిగుమ్మ, చంపి, తోయాపుట్‌, లక్ష్మీపూర్‌ సమితి కేంద్రాల గుండా ప్రయాణం చేస్తుంది. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలను లక్ష్మీపూర్‌ చేర్చడానికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి చైర్మన్‌ సువై కులసిక, జిల్లా పరిషత్‌ సభ్యురాలు పింకి హిమరిక, ఒడియా పెంట సర్పంచ్‌ బన్సి మండిగా, పూర్ణ మండింగా తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర తొలియ విగ్రహం ఏర్పాటు చేయండి



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జయపురం: సొంత గ్రామంలో జవాన్‌ ఈశ్వర్‌ తొలియ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జయపురం సబ్‌ డివిజన్‌ బొయిపరిగుడ సమితి ఖెందుగుడ గ్రామ పంచాయతీ బొడగుడ గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీడీవోకు ఒక వినతిపత్రం సోమవారం అందజేశారు. డిసెంబర్‌ నాటికి అత్యంత వేగంగా విగ్రహం ఏర్పాటును పూర్తి చేయాలని విన్నవించారు.

నీటికుంటలో పడి బాలిక మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కొరాపుట్‌: నీటికుంటలో పడి బాలిక మృతి చెందిన ఘటన కొరాపుట్‌ జిల్లా నారాయణపట్న సమితి భోజా గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఉదయం స్కూలుకు వెళ్లిన బాలిక కరిస్మిత హబిక(7) తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలో నిర్మిస్తున్న మెగా తాగునీటి పథకం కోసం తవ్విన నీటికుంటలో ఆమె మృతదేహం కనబడింది. వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీశారు. నారాయణపట్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో బాలుడు మృతి



బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి దామాగుడ గ్రామంలో రామా కబాసీ (17) అనే బాలుడు పాముకాటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రామా కబాసీ సోమవారం రాత్రి భోజనాలు చేసిన అనంతరం తమ ఇంటి బయట వరండాలో తండ్రితో కలిసి నిద్రించాడు. అయితే అర్ధరాత్రి ఒక విష సర్పం బాలుడి ఎడమ చెవిభాగంలో కాటు వేసింది. బాలుడు కేకలు వేయడంతో తండ్రి లేచి చూస్తే నల్ల త్రాచుపాము కన్పించింది. అదే కాటు వేసింది అని తెలుసుకొని గ్రామస్తుల సాయంతో వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. కలిమెల పోలీసులు విషయం తెసుకొని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెరువులో మునిగి మహిళ మృతి



పార్వతీ మడ్కమి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కేంద్రానికి చెందిన పార్వతీ మడ్కమి (45) మంగళవారం ఉదయం దుస్తులు ఉతకడానికి వెళ్లి చెరువులో కాలుజారి పడిపోయింది. మధ్యాహ్నం అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా జాడ కనిపించలేదు. అయితే అటుగా వచ్చిన కొంత మంది మహిళలకు ఆమె చీర తేలుతూ కనిపించడంతో సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె కుమారుడు విజయ్‌ మడ్కమి చెరువు వద్దకు వచ్చి ఆమెను బయటకు తీసి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలియడంతో ఐఐసీ ముకుంద్‌ మేల్కా ఆరోగ్య కేంద్రానికి వచ్చి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

కల్పవల్లి.. అందుకో మా సారె..!



అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివస్తున్న మహిళలు



మేళతాళాలతో ఆలయానికి తరలి వెళ్తున్న భక్తులు

రాయగడ పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని కోరుతూ గత మూడేళ్లుగా మజ్జిగౌరి అమ్మవారికి ఆషాఢ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పుట్టింటి సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక బుదరావలసకు చెందిన ఐదు లైన్లలో ఉంటున్న కుటుంబాలు అమ్మవారికి ఆషాఢ మాసం సారెను మంగళవారం అందించారు. సుమారు రెండు వేల మందికి పైగా మహిళలు తమ ఇళ్లలో ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలతో పాటు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం రోజున పూజలు చేస్తే తమ కోర్కెలు నెరవేరుస్తుందని ఇక్కడి ప్రజల నమ్మకం. – రాయగడ



భక్తులు తీసుకొచ్చిన పిండివంటలు

నెక్కంటిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌ ఎదుట ఆందోళన చేస్తున్న లారీ యజమానులు, డ్రైవర్లు



పోలీస్‌స్టేషన్‌లో నెక్కంటిపై ఫిర్యాదు చేస్తున్న కొండబాబు తదితరులు

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ, జిల్లా బీజేడీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, అతని అనుచరులు బి.మన్మథరావు(చిట్టి), కృష్ణలపై రాయగడ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాల్ల కొండబాబు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా గత 40 ఏళ్లుగా వ్యవహరించిన నెక్కంటి, అతని అనుచరులు సంఘానికి సంబంధించిన ఆదాయం లెక్కలు చూపించకుండా స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం తాను (కొండబాబు) లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరర్వాత ఇప్పటివరకు సంఘం పేరుమీద సుమారు రూ.2 కోట్లు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అయితే నలభై ఏళ్లుగా సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన నెక్కంటి కనీసం ఒక్క రూపాయి ఆదాయం సంఘం పేరుమీద ఉన్నట్లు చూపించలేదని వివరించారు. ఇకపై ఆయన ఆగడాలకు చెక్‌ పెట్టే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. సంఘానికి సంబంధించిన ఆదాయం లెక్కలను చూపించాలని, లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ ఎదుట కొద్దిసేపు నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం కార్యదర్శి కడుపుకూట్ల జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌ పోలీసులు శారదాపూర్‌ అడవుల్లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా శారదాపూర్‌ అడవుల్లో రవాణాకు సిద్ధంగా ఉన్న 199 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసుల రాకను గమనించిన రవాణాదారులు అక్కడ నుంచి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అంచనా. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చంద్రపూర్‌లో...

గంజాయి సాగుకు నిలయంగా గుర్తింపు పొందిన చంద్రపూర్‌లో పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్‌.కుమార్‌ ఆదేశాల మేరకు విస్తృతంగా దాడులు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కిరమా కూడలిలో ఒక వ్యక్తి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఈ మేరకు కోర్టుకు తరలించారు.



గంజాయితో పట్టుబడిన నిందితుడు

క్రిమినల్స్‌పై ఉక్కుపాదం

- నేరస్తుల కట్టడిలో రాజీలేని చర్యలు
- ఎస్పీ రోహిత్‌ వర్మ వెల్లడి

కొరాపుట్‌: జయపూర్‌ పట్టణాన్ని నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ మేరకు కొరాపుట్‌ జిల్లా ఎస్పీ రోహిత్‌ వర్మ జయపూర్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సుదీర్ఘంగా ప్రసంగించారు. దశాబ్దాలుగా ఉన్నటువంటి నేరస్తుల ఏరివేతలో రాజీలేని చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ ఏడాది మార్చి నుంచి దారి దోపిడీలు, చైన్‌ స్నాచింగ్‌ కేసుల్లో 81 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ కేసుల్లో 30 ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్‌, 40 బంగారు రింగులు, 10 మంగళసూత్రాలు, రూ.6.75 లక్షల నగదు సీజ్‌ చేశామన్నారు. బెదిరింపు ఘటనల్లో మరో పదిమందిని అరెస్ట్‌ చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాలో 31 మంది కరుడుగట్టిన నేరస్తులను అరెస్ట్‌ చేసి 2,501 కేజీల గంజాయి, 585 ఇంజెక్షన్లు, 7 కార్లు, 3 తుపాకీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కిడ్నాప్‌ కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. మరి కొన్ని దాడుల కేసుల్లో మరో 19 మందిని అరెస్టు చేశామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌ వర్మ, ఎస్‌డీపీవో పార్థవ్‌ కశ్యప్‌లు

అనుక్షణం పోలీసు నిఘా

పట్టణంలో అనుక్షణం పోలీసు నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. నేరస్తులు తమ నేర ప్రవర్తన వదిలి సామాన్య జీవితం గడపాలని పిలుపునిచ్చారు. బెయిల్‌ మీద వచ్చిన వారి మీద కూడా పోలీసు నిఘా ఉంటుందన్నారు. నేరస్తుల పాత కేసుల జాబితా సిద్ధం చేసి కోర్టులకు సమర్పించి బెయిల్‌ అడ్డుకుంటామన్నారు. ఎక్కడైనా బెదిరింపులకు పాల్పడితే 94389 16918 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోన్‌ చేసిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇకపై గంజాయి అక్రమ రవాణా చేసి పట్టుబడితే వారి పేరు మీద ఉన్న ఆస్తులు ప్రభుత్వపరం చేసే చర్యలు ఉంటాయని గుర్తు చేశారు. కాగా జయపూర్‌ చరిత్రలో తొలిసారిగా అత్యధిక 15 మంది నేరస్తులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ మేరకు ఎస్పీ రోహిత్‌ వర్మ నేరస్తుల అరెస్టులను అధికారికంగా ప్రకటించారు. సమావేశంలో ఎస్‌డీపీవో పార్థవ్‌ కశ్యప్‌ తదితరులు ఉన్నారు.

125 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక కాళీకృష్ణ సంఘ ప్రతిష్ట దినోత్సవం, సద్గురు దేవ్‌ స్వామీ సశ్చిదానంద సరస్వతీ మహారాజ్‌ 83వ జన్మదినం పురస్కరించుకొని స్థానిక కాళీకృష్ణ మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 125 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కాళీకృష్ణ సంఘ అర్జున పటానాయిక్‌ గిరిజానంద, ముకుంద నంద, మృత్యుంజయ ఠాకూర్‌, అమిత మిత్ర, దివాకర దొలాయ్‌, అరుణ షొడంగి, జన్మేజయ దాస్‌, సంతోష్‌ కౌర్‌, కాళీకృష్ణ, అనిల్‌ పండ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

కొరాపుట్‌: పుస్తెల తాడు చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు నబరంగ్‌పూర్‌ ఎస్‌డీపీవో కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటించారు. ఫిబ్రవరి 2వ తేదీన డొంగ్రుబజ గ్రామంలో ప్రశాంత్‌ పాత్రో భార్య సరోజిని పాత్రో తన కిరాణా షాపులో విక్రయాలు చేస్తోంది. అదే సమయంలో తెంతులకుంటి సమితి కూర్మాకోట్‌ గ్రామానికి చెందిన దిలీప్‌ దాస్‌ ఆమె మెడలో బంగారు పుస్తెల తాడు తెంచుకొని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దిలీప్‌ను అరెస్టు చేసి 07.55 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.



అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

పూజా సామగ్రి దుకాణం దగ్ధం

కొరాపుట్‌: జిల్లాలోని సునాబెడా పట్టణంలో దుకాణం దగ్ధమైంది. మంగళవారం వేకువజామున 6వ నంబర్‌ వార్డులో సహదేవ్‌ శెఠికి చెందిన పూజా సామగ్రి దుకాణం పూర్తిగా కాలిపోయింది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ వలన జరగడంలో ఈ ప్రమాదంలో షాపులో ఉన్న రూ.4 లక్షల విలువ కలిగిన సామాన్లు బూడిదగా మారాయని బాధితుడు వాపోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే సునబెడా మున్సిపల్‌ చైర్మన్‌ డాక్టర్‌ రాజేంద్ర కుమార్‌ పాత్రో ఘటన స్థలం సందర్శించారు. తక్షణ ఆర్థిక సాయం అందజేశారు.



సునాబెడాలో దగ్ధమైన దుకాణం

మర్యాదపూర్వక భేటీ



రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్‌ కుమార్‌ పూజారి మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ డాక్టర్‌ హరిబాబు కంభంపాటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిరువురు పాలన, విపత్తు నిర్వహణ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. విపత్తు ప్రతి స్పందన వ్యవస్థలను బలోపేతం చేయడం, భూమి మరియు రెవెన్యూ పాలన వ్యవస్థ క్రమబద్ధీకరణ, ప్రజాసేవల పంపిణీ మెరుగుదల లక్ష్యంగా వ్యూహాత్మకమైన అభివృద్ధి కార్యాచరణపై సంభాషించారు. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ చేపడుతున్న కీలక కార్యక్రమాల గురించి మంత్రి సురేష్‌ కుమార్‌ గవర్నర్‌కు సవివరంగా తెలియజేశారు. - భువనేశ్వర్‌

ఐరాస రికార్డుల్లో చోటు

ఐక్యరాజ్య సమితి రికార్డుల్లో స్థానిక కళింగ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌ (కిస్‌) స్థానం చేజిక్కించుకుంది. గిరిజన యువతకు సాధికారత కల్పించడంలో తిరుగులేని సంస్థగా ప్రాధాన్యత సంతరించుకుని ఈ ప్రతిష్టాత్మక గుర్తింపుని సాధించడం విశేషం. పరివర్తనాత్మక, ప్రయోజనకర విద్యా బోధనతో గిరిజన మరియు ఇతర వెనుకబడిన యువతకు సాధికారత కల్పించడంలో కిస్‌ నిరంతర కృషిని ఐక్యరాజ్య సమితి ఆర్థిక మరియు సామాజిక మండలి (ఈసీఓఎస్‌ఓసీ) గుర్తించింది. గిరిజన సమూహాల నుంచి బాలలను అక్కున చేర్చుకుని కిస్‌ సంస్థ బాహ్య ప్రపంచంలో హుందాగా ఉనికిని ప్రదర్శించే రీతిలో తీర్చిదిద్దుతోంది. - భువనేశ్వర్‌



సమభావంతో అభ్యాస సాధనలో విద్యార్థి సమూహం

క్లుప్తంగా

నవజీవన ఆశ్రమంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి హరిబాబు

గార: మౌలిక వసతుల కల్పనతో పాటు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా నిర్వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి కె.హరిబాబు అన్నారు. మంగళవారం శ్రీకూర్మంలోని నవజీవన ఆశ్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల హాస్టల్, తరగతి గదులు, వంటశాల పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేపట్టారు. ఏమైనా సమస్యలుంటే పరిశీలనకు వచ్చే అధికారులకు తెలియజేయాలన్నారు.

కార్డన్ సెర్చ్ కలకలం



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

టెక్కలి రూరల్: టెక్కలి మండల కేంద్రంలోని గొల్లవీధిలో సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అపరిచితులు, నిషేధిత పదార్థాలకు సంబంధించి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కాగా, ఇతర పత్రాలు సక్రమంగా ఉన్నా సీ బుక్‌లో ఉన్న వ్యక్తి లేకపోయినా వాహనం తీసుకువెళ్లిపోయారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

శభాష్ అయ్యవార్లు!



కొత్తపెంట పాఠశాలలో చేరిన తమ పిల్లలతో ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని కొత్తపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పొగిరి పండు అప్పలనాయుడు, మక్క లక్ష్మునాయుడు, వి.మమత స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో కాకుండా అత్యుత్తమ ఫలితాలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి అభినందనలు అందుకుంటున్నారు. వీరి పిల్లలు పొగిరి నూతన్ కుమార్(6వ తరగతి), మక్క మోక్ష వర్షిణిచ, వేదిత్‌లను కొత్తపెంట స్కూల్లోనే చేర్పించడంతో ప్రధానోపాధ్యాయులు ఎస్.భానుమూర్తి, వి.రవి, గ్రామస్తులు అభినందించారు.

కర్షకులకు కొనసాగుతున్న కష్టాలు

● ఎరువుల కోసం తప్పని పాట్లు



కొత్తూరు రైతుసేవాకేంద్రంలో అధిక సంఖ్యలో రైతులు

కొత్తూరు: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. కొత్తూరు రైతు సేవా కేంద్రానికి ప్రభుత్వం 20 టన్నులు యూరియా కేటాయించింది. తక్కువ మొత్తంలో రావడంతో రైతులు రెండు రోజులుగా ఆర్‌ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం యూరియా విక్రయిస్తారని గ్రామ వ్యవసాయ సహాయకులు చెప్పడంతో పెద్ద సంఖ్యలో రైతులు చేరుకున్నారు. అడంగల్ పత్రాలు ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయిస్తామని చాలామంది నిరాశతో వెనుతిరిగారు.

పెన్‌కాక్‌సిలాట్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు, జిల్లా సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ నేషనల్స్ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులోని త్రిచి జిల్లాలో ఉన్న కొంగునాడు ఇంజినీరింగ్ కాలేజీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు 6వ సౌత్‌జోన్ పెంకాక్‌సిలాట్ పోటీలు జరగగా.. అంధవరపు సాయి ప్రశాంత్, దున్న సుచెరిత, కొండేటి హరీష్, బంగారు పతకాలు సాధించారు. దున్న సుమన, రెడ్డి యోగామృత, అంధవరపు లలిత్‌మిదిన్, పి.షాన్, కె.దీక్షిత రజత పతకాలు, బి.నాగేశ్వరి, బి.జ్యోతి సాయి ప్రసాద్, సాన సుజిత్ శంకర్, ఎస్.సహస్ర, బి.కార్తికేయ, పి.పవన్, పి.రాకేష్ నాయుడు, మండా రామ్‌సాయి, విహాస్ శర్మ కాంస్య పతకాలు సాధించారు. వీరిని పెన్‌కాక్‌సిలాట్ సంఘ జిల్లా అధ్యక్షులు రేగిడి దయమయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్ నాయుడు, శ్రీ పరశురామ యుద్ధకళా క్షేత్రం కోచ్ లింగాల ఈశ్వర్‌రావు అభినందించారు. హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ హేమంత్ యాదవ్, హరీష్ పాల్గొన్నారు.

టికెట్ల విక్రయంలో ఖుర్దారోడ్ టాప్

● తొలి త్రైమాసికంలో గణనీయంగా పెరిగిన ఆదాయం



స్వయంగా టికెట్ కొనుగోలు చేస్తున్న ప్రయాణికుడు



కిటకిటలాడుతున్న ఏటీవీఎం ప్రాంగణం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వేలో ఖుర్దారోడ్ మండలం టికెట్ల విక్రయంలో అధునాతన సౌకర్యాలతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. టికెట్లు కొనుగోలు కోసం ప్లాట్‌ఫారాల ప్రాంగణాల్లో ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ల (ఏటీవీఎంలు) వాడకంలో ప్రయాణికులను గణనీయంగా ప్రోత్సహిస్తోంది. మండల వ్యాప్తంగా వివిధ రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన ఏటీవీఎంలు, టచ్ స్క్రీన్ ఆధారిత కియోస్కులు దూర ప్రాంతాల ప్రయాణికులకు చిటికెలో సాధారణ టికెట్లని అందజేస్తున్నాయి. వాటితో ప్లాట్‌ఫామ్ టిక్కెట్లు, నెలవారీ మరియు త్రైమాసిక సీజన్ టిక్కెట్లను ఈ వ్యవస్థ అందజేస్తుంది. స్మార్ట్ కార్డులు, క్యూ ఆర్ కోడ్ ఆధారిత యూపీఐ చెల్లింపులతో సహా బహుళ చెల్లింపు విధానాలతో ప్రయాణికులకు ఇబ్బందిరహితంగా టికెట్లు విక్రయిస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఖుర్దారోడ్ మండలం ఏటీవీఎంల ద్వారా వివిధ ప్రాంతాలకు ప్రయాణించే 41,28,866 మంది ప్రయాణికులకు 27,24,298 టిక్కెట్లను జారీ చేసి సమగ్రంగా రూ.30.69 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ ఆదాయం ఈ ఏడాది మరింత పుంజుకుంది. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) గత ఆర్థిక సంవత్సరంలో ఈ సమయానికి ఏటీవీఎం 7,99,760 మంది ప్రయాణికులకు 5,40,447 టిక్కెట్లు జారీ చేయగా ఈ ఏడాది ప్రయాణికులకు 7,97,340 టికెట్లు జారీ చేసింది. ఈ క్రమంలో ఆదాయం సగం పైబడి పుంజుకుంది. గతేడాది రూ.5.93 కోట్లకు పరిమితమైన ఆదాయం ఈ ఏడాది 65.5 శాతం పెరుగుదలతో రూ.9.82 కోట్లు ఆర్జించింది.

మైనర్ బాలికపై లైంగిక దాడి

● నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితుడు ట్రక్ డ్రైవర్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఒక మైనర్ బాలికపై నలుగురు దుండగులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. మల్కన్‌గిరి పోలీసుస్టేషన్ పరిధికి చెందిన ఒక బాలిక తన స్నేహితురాలి పుట్టినరోజుకు సోమవారం ఉదయం వెళ్లింది. కానీ సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. కాగా బిజఘాటీ వద్ద మంగళవారం ఉదయం బాలిక నడవలేని స్థితిలో ఉండడంతో అటుగా వస్తున్న కొంతమంది గమనించారు. అక్కడికి దగ్గరలో ట్రక్ డ్రైవర్‌ను చూసి అనుమానంతో పోలీసులకు తెలియజేశారు. దీంతో వెంటనే పోలీసులు వచ్చి డ్రైవర్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు. విచారణలో బాలికపై డ్రైవర్‌తో సహా మరో ముగ్గురు లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం బాలికను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిత్రకొండ ఎమ్మెల్యే మంగుళీలో మండిపడ్డారు. బీజేపీ పాలనలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు పెరగుతున్నాయని దుయ్యబట్టారు.

నూతన ప్రతిజ్ఞ విధానం అమలు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ మహిళా విద్యాలయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూతన ప్రతిజ్ఞ విధానం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. కళాశాల ప్రాంతంలో శాంతి భద్రతల విషయంలో అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి సమాజంలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ముందుకు సాగాలన్నారు. కళాశాలలో ఉన్న యువతీ, యువకులు సామాజిక పరిరక్షణ కోసం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలేశ్వరి సాహు, అధ్యాపకులు సంజుక్తా పండా, ఉపేంద్ర ఖోస్లా, ఎస్.ఎస్.ఖోస్లా, రంజితా ప్రహరాజ్, సైరా బేగం తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

నరసన్నపేట:

దాతలు తమ ఔదార్యాన్ని చాటుతూ మానవత్వాన్ని చూపుతున్నారు. నరసన్నపేట మండలం దేవాది కాలనీలో ఆరు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు బాలికలకు దాతలు ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఈ నెల 16న 'దేవాదిలో విషాదం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో బాలికలను ఆదుకోవడానికి దాతలు ముందుకు వస్తున్నారు. రెండు రోజుల క్రితం కంబకాయకు చెందిన దాతలు రూ.25500 అందించగా.. తాజాగా మంగళవారం సంతబొమ్మాళి మండలం గోవిందాపురానికి చెందిన శ్రీ రేయమ్మతల్లి యూత్(హెల్పింగ్ హ్యాండ్స్) సభ్యులు మరో రూ. 25 వేలు, టెక్కలి చెందిన అభయం సేవా సంఘం సభ్యులు రూ.50 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం ప్రతినిధులు దేవాది శ్రీనివాసరావు, సింహాచలం, ధర్మారపు పూర్ణారావు, సర్పంచ్ మంతిన రాము తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు నగదు అందిస్తున్న రేయమ్మతల్లి యూత్ సభ్యులు

యువకుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రం సమీపంలోని బైరివానిపేట కూడలి, రాగోలు మార్గాల్లోనే కాకుండా కోర్టు ఆవరణలో పలు చోరీలకు పాల్పడిన పెద్దపాడు యువకుడు కె.రామును మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వెల్లడించారు. గతేడాది సెప్టెంబరు 14న బైరివానిపేట సమీప సురాస్ బిల్డ్ మార్ట్ షాపులో వైర్లు, ఎలక్ట్రిక్ సామగ్రి, రాగోలుకు వెళ్లే దారిలో అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లో ల్యాప్‌టాప్, కోర్టు ఆవరణలో టీవీ, ఆదిత్యనగర్‌కాలనీలో నిర్మాణదశలో ఉన్న అపార్ట్‌మెంట్లో వైర్లు, సంస్కార్ స్కూల్లో వైర్‌బండిళ్లు, పీఎన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఏవీఎం టవర్స్ అపార్ట్‌మెంట్ వద్ద వైర్‌బండిళ్లను రాము చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. గతంలో హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇంటి తలుపులు పగులగొట్టి చోరీలు చేసినట్లు తెలిసిందన్నారు.

ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. నిందితుడి నుంచి రూ. 3 లక్షల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకుని జిల్లా జైలుకు తరలించామన్నారు.

నేరాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులు కృషి చేయాలని, పెండింగ్ వారెంట్లు త్వరితగతిన అమలుకు పంపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు, పరిష్కారం, మాదకద్రవ్యాల నియంత్రణ, నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు, విజిబుల్ పోలీసింగ్, కార్డన్ అండ్ సెర్చ్ సోదాలు వంటి అంశాలపై జిల్లాలో గల డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు వంటి మందిరాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా కమిటీలను సన్నద్ధం చేయాలన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించాలని, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కళాశాలలు, పాఠశాలల పరిధిలో ఎలాంటి ర్యాగింగ్, ఇతర నేరాలు జరగకుండా చూడాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



పింటు (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధి ఎంపీవీ 83 గ్రామానికి చెందిన పింటు సాన (29) అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పింటు వరంగల్‌లోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే అతను డ్యూటీ సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం పింటు మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ప్రస్తుతం మృతుడి భార్య గర్భవతి కావడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

బాలుడి దత్తత



బాలుడిని దత్తతగా అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కటక్ జిల్లాకు చెందిన దంపతులు స్థానిక కలెక్టరేట్ నుంచి 12 ఏళ్ల బాలుడిని అదనపు జిల్లా మాజిస్ట్రేటు ఫాల్గుని మఝి చేతుల మీదుగా మంగళవారం దత్తత తీసుకున్నారు. అనాథ శిశువును శిశు సంక్షేమ సమితి ఆదేశాల మేరకు ఉత్కళ బాలాశ్రమంలో ఉంచి సంరక్షించారు. ఈ బాలుడిని కేంద్ర దత్తత పోష్యకేంద్రం పోర్టల్‌లో చూసి కటక్‌కు చెందిన దంపతులు రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకోగా ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు జిల్లా నుంచి 72 మంది శిశువులను దేశ, విదేశాల దంపతులకు దత్తతగా అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, శిశు సంక్షేమ శాఖ సభ్యురాలు మమతా శతపతి, జిల్లా శిశు సంరక్షణాధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, ఉత్కళ బాలాశ్రమం కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల పరిధిలోడిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు వర్సిటీ పరీక్షల యూజీ డీన్ డాక్టర్ జి.పద్మారావు మంగళవారం తెలిపారు. రెగ్యులర్ విధానంలో 6,972 మందికి గాను 42.47 శాతం మంది, సప్లిమెంటరీలో 4,837 మందికి గాను 55.53 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



రామకృష్ణ(ఫైల్)

హిరమండలం: ఎల్‌ఎన్‌పేట మండలం బొత్తాడిసింగి గ్రామానికి చెందిన గుమ్మడి రామకృష్ణ (44) పాముకాటుకు గురై సోమవారం రాత్రి మృతి చెందాడు. రామకృష్ణ భార్యతో కలిసి వ్యవసాయ పనులు చేసేందుకు పొలానికి వెళ్లారు. రామకృష్ణ పని చేస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే ఎల్‌ఎన్‌పేట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈయనకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జీతాల సమస్య పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ : వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు జీతాల చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి త్వరితగతిన జీతాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కోర్టు భవనం ప్రారంభం



గ్రామ న్యాయాలయం ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడిశా హైకోర్టు చీఫ్ జస్టిస్ హరీష్ టాంటన్ వర్చువల్‌గా గజపతి జిల్లా కాశీనగర్‌లో గ్రామ న్యాయాలయం, జేఎంఎఫ్‌సీ నూతన కోర్టు భవనాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి గజపతి జిల్లా జడ్జి జగదీష్ ప్రసాద్ మహంతి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

కార్యక్రమంలో జేఎంఎఫ్‌సీ మోనాలీ బెహరా, రిజిస్ట్రార్ ప్రసన్న కుమార్ బెహరా, ఎస్‌జే సాహు, పర్లాకిమిడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జిత్తు పట్నాయక్, సభ్యుడు ఎం.పృథ్వీరాజ్, న్యాయవాదులు పంటల ప్రసాదరావు, ఏకే పండా, ప్రభుత్వ న్యాయవాది శైలాడ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి 25 మంచాలు వితరణ



మంచాలను అందజేస్తున్న సంజయ్ కుమార్ జైన్ తదితరులు

కొరాపుట్: జయపూర్ పట్టణంలోని కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి 25 పరుపులతో కూడిన మంచాలను జయపూర్ బెల్ రోడ్డుకి చెందిన దివంగత కమల్ రాజ్ జైన్ గుర్తుగా అతని కుమారులు మంగళవారం అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త సంజయ్ కుమార్ జైన్ సోదరులు ఈ సామగ్రిని ఆస్పత్రి యాజమన్యానికి అందజేశారు. కార్యక్రమంలో జేకే బీకే వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమితి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం



సమితి చైర్‌పర్సన్ లక్ష్మీ సాబొరొ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుడారి సమితిలో రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సమితిలో ఈనెల 24వ తేదీన సమితి చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ సాబొరొకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం అవిశ్వాస తీర్మానానికి సంబంధించి తేదీ ఖరారు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సమితి సభ్యులు, సర్పంచ్‌లు, గుణుపూర్ ఎమ్మెల్యే, చైర్మన్, వైస్ చైర్మన్లు హాజరవ్వాలని కోరారు. గత నెలలో సమితి వైస్ చైర్మన్ విశ్వనాథ్ సాబొరొ నేతృత్వంలో 14 మంది సభ్యులు చైర్మన్ లక్ష్మీపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం దాఖలు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం తేదీ ఖరారు చేశారు. అయితే ఈ సమితిలో 18 మంది సమితి సభ్యులు, సర్పంచ్‌లు ఉన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేతో కలిపి మొత్తం 20 ఓట్లు ఉన్నాయి.

సారా స్థావరాలపై విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, పలాస మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన సింగుపూర్, కుయారా, పెద్ద బురుజోల, చిన్న బురుజోల పరిసరాల్లో 160 లీటర్ల సారా, 12,700 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటలను ధ్వంసం చేసి, భారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్లు మురళీ, రామచంద్ర కుమార్, గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహూ, ఎన్‌ఫోర్స్‌మెంట్స్ వింగ్, పాతపట్నం, నరసన్నపేట, పొందూరు, శ్రీకాకుళం టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు, పర్లాకిమిడి, కాశీనగర్, గురండి, గారబంద ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గార: బంగారు కుటుంబాలు సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం గారలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌తో కలిసి గ్రామసభలో పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సంక్షేమ కార్యక్రమాలు అమలును అడిగి తెలుసుకున్నారు. కొత్తూరు సైరిగాం వద్ద ఆటోలో యూరియా బస్తాలు వెళ్తుండటంతో వాటి వెనుకనే గ్రామంలోకి వెళ్లి 16 బస్తాలు ఒకేసారి ఎందుకు వెళ్తున్నామని ప్రశ్నించారు. ఎనిమిది మంది రైతులు తెచ్చుకున్నామని తెలియజేశారు. అనంతరం సమీపంలోని ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి విద్యార్థుతో ముచ్చటించారు. మౌలిక వసతులపై హెచ్‌ఎం ఆర్.రమణమూర్తితో మాట్లాడగా.. అదనపు తరగతి భవనాలు అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీఓ ఏ.రఘు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి నివాళులు



బొడ్డపాడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పోతనపల్లి దుష్యంతు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సైనికులు ఆధ్వర్యంలో భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. దుష్యంతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

–పలాస

డబుల్ రోడ్డు పనులు పునఃప్రారంభం



డబుల్ రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్ : పలాస నియోజకవర్గంలో బెండి గేటు నుంచి బెండి మీదుగా నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదగా కాశీబుగ్గ వరకు అధ్వానంగా మారిన రోడ్ల దుస్థితిపై 'ఎన్నాళ్లీ రహదారిద్ర్యం?' అనే శీర్షికతో ఈ నెల 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు పునఃప్రారంభించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నువ్వలరేవు–రేగిలపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.23 కోట్లు, వజ్రపుకొత్తూరు అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ వరకు సుమారు రూ.21 కోట్లు వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు సిద్ధం చేస్తామని చెప్పి ఏడాది కాలం దాటిన తర్వాత పనులు మళ్లీ ప్రారంభించడం కొసమెరుపు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కొత్తవలస: మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న యువకుడు రంధి వేణు(22) రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి దుర్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామాన్ని ఆనుకుని నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా స్కూటీపై తన స్నేహితుడు మేడపురెడ్డి మోహన్‌తో కలిసి కొత్తవలస వచ్చేందుకు వేణు బయల్దేరాడు. జోరుగా వర్షం కురుస్తుండడంతో తడిసిపోతామనే ఆందోళనతో బైక్‌ను వేగంగా నడపగా బైక్ అదుపు తప్పి రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో వేణు పీకకు రెయిలింగ్ తగలగా కోసుకుపోయి అధిక రక్త స్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ నడుపుతున్న మోహన్ తుళ్లి దూరంగా పడిపోగా తల, చేతులకు తీవ్రగాయాలయాయి. స్థానికులు ఈ ప్రమాదాన్ని గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి వేణు మృతి చెందినట్లు నిర్ధారించారు. మోహన్‌ను విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా లేదా రైలు దిగుతుండగా గాని ప్రమాదం జరిగి ఉండవచ్చన్నారు. ఆచూకి తెలిసిన వ్యక్తులు ఈశ్వరరావు రైల్వే హెచ్‌సీ ఫోన్ 9491813163,8309901038 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువులో మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస స్టేషన్ పరిధిలో ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. మండలంలోని జమ్ము నారాయణపురం వద్ద ఉన్న కోమటి చెరువులో మహిళ మృతదేహం ఉందని స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై అశోక్ ఘటనా స్థలికి వెళ్లి, ఈతగాళ్ల సహాయంతో చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతిచెందిన మహిళ వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై అశోక్ తెలిపారు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రామభద్రపురం: మండలంలోని మిర్తివలస వద్ద పురుగు మందు తాగి ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్యచేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సాలూరులోని ఎరుకల వీధికి చెందిన పాలవలస శేఖర్ (24) ఆమ్లెట్ మాడిందన్న ఉద్దేశంతో భార్య ఆదిలక్ష్మితో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శేఖర్ మనస్తాపానికి గురై మిర్తివలస గ్రామం జంక్షన్‌లోని హెరిటేజ్ దుకాణాం వద్ద పురుగు మందు తాగాడు. ఈ విషయం గమనించిన స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, పాప, బాబు ఉన్నారు. మృతుడి తండ్రి పైడి రాజు ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.





అందానికి అందం ఎర్ర చందనం..!

- ఔషధ గుణాలు మిన్న
- స్థిరాస్తిగా సాగు
- తరాలుగా చెక్కుచెదరని దృఢత్వం
- యథేచ్ఛగా మొక్కల అమ్మకం

భామిని: కళ్లు చెదిరే ధర..మన్నికకు మన్నిక..ఇంట్లో ఉంటే శుభకరం.. ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న ఎర్రచందనం తోటలు అందానికి అందంగా ఉంటూ స్థిరాస్తిగా మొక్కల సాగు చేపడుతున్నారు. ఎర్ర చందనం ప్రత్యేకతలెన్నో దీని శాస్త్రీయ నామం టెరోకార్పస్ శాంటాలినస్. దీని కాండంలోని చేవ(ముదిరిన భాగం)కుంకుమ రంగులో ఉండడంతో రక్త చందనంగా పిలుస్తారు. చెట్టును నరికే సమయంలో సువాసన వెదజల్లుతుంది. శాఖోపశాఖలు లేకుండా నిటారుగా చెట్లు పెరుగుతాయి. దీని కాండం సుమారు 50 నుంచి 150 సెంటీమీటర్లు మాత్రమే విస్తరిస్తుంది. 20 నుంచి 30 అడుగుల వరకు చెట్లు నిటారుగా పెరుగుతాయి. పొలం గట్లు, ఇతర పంటలలో సాగు చేసినా పంటలకు నష్టం ఉండదు. దశాబ్దాల కాలంలో చెట్లు చేవదేరుతాయి. కొట్టేసిన చెట్లు మొదళ్ల నుంచి మళ్లీ మొలకలు పుట్టి చెట్లుగా ఎదగడం దీని ప్రత్యేకత. ఎర్రచందనం కలప దుంగల సాంద్రత నీటి స్పెసిఫిక్ గ్రావిటీ కంటే తక్కువ కావడంతో నీటిలో మునుగుతాయి.

ఏజెన్సీల్లో విస్తరణ..

రెడ్‌శాండిల్ తోటలు పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ఏజెన్సీ ప్రాంతాలకు పాకుతున్నాయి. భామిని, సీతంపేట, పాలకొండ, పార్వతీపురం, కొమరాడ, మక్కువ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో రెడ్ శాండిల్ తోటలు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా తివ్వాకొండ పరిసరాల్లో గిరిజనులు సైతం సాగు చేస్తున్నారు. కడియం నర్సరీ నుంచి అంటుకట్టిన మొక్కలు సులభంగా గ్రామాలకు



కొరమ సమీపంలో రియల్ ఎస్టేట్‌లో పెరుగుతున్న రెడ్‌శాండిల్ మొక్కలు

చేరుతున్నాయి. చివరికి అటవీశాఖ నిర్వహించే సామాజిక నర్సరీలలోనూ రెడ్‌శాండిల్ మొక్కలు పెంచి పంపిణీ చేస్తున్నారు. కొండ ప్రాంతాలతో పాటు పల్లపు ప్రాంతాల్లోనూ, రియల్ ఎస్టేట్ రంగంలో శాండిల్ సిటీలు వ్యాప్తి చెందుతున్నాయి. విద్యాసంస్థలలో సుందరంగా రక్త చందనం చెట్లు తోపులుగా పెరుగుతున్నాయి.

సాగుకు ప్రోత్సాహం..

అంతరించిపోతున్న వృక్ష,జంతు జాతుల వాణిజ్యంపై అంతర్జాతీయ ఒడంబడిక(సైట్స్) గతంలో విధించిన నిషేధాన్ని సడలించింది. ఎర్రచందనంతో తయారు చేసిన సంగీత వాయిద్యాలు, పరికరాలు, రసాయనాలు, రంగుల వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులకు అనుమతులు ఇవ్వడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.



నిటారుగా పెరుగుతున్న చెట్లు

ఔషధ గుణాలు మెండు..

- లైంగిక సామర్థ్యం పెంపు కోసం వాడే వయగ్రా వంటి ఔషధాల తయారీలో ఎర్ర చందనం రసాన్ని వాడుతున్నారు.
- టెరోసిబిలిన్ రసాయనం లైంగిక సామర్థ్యం పెంచడంలో వయాగ్రా కన్న శక్తివంతమైంది.
- దీని బెరడు నుంచి తీసిన ఇథనాల్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను బాగా తగ్గిస్తుంది.
- మనిషి బరువులో కిలోకు 0.25 గ్రాముల చొప్పున ఎర్రచందనం ఇథనాల్ వాడితే మధుమేహం చక్కగా నియంత్రణలో ఉంటుంది.
- పూర్వీకులు ఎర్రచందనంలో ఔషధ గుణాలను గుర్తించి రోకళ్లు చేయించి ధాన్యాలు దంచేందుకు ఉపయోగించే వారు. శుభకరంగా భావించి దేవతామూర్తులు, ప్రతిమల రూపంలో పూజలు అందుకునేవి.
- దృఢత్వం, ఆకర్షణీయమైన రంగులోని ఎర్రచందనం కలపతో గృహోపకరణాలు, అలంకరణ ఆకృతుల తయారీకి ఉపయోగించడం ఆనవాయితీ.
- పిల్లలకు వచ్చే ఉదర లోపాలకు రక్తచందన లేపనం, పండ్ల కషాయం జిగట విరేచనాల నివారణకు మందు. బెరడు పేస్టుతో చల్లదనంతో పాటు, తలనొప్పి నివారణ జరుగుతుంది.
- రెడ్‌శాండిల్ హెయిర్ డ్రైయింగ్, చర్మ సౌందర్యం సాధనంగా ఉపయోగపడుతుంది.

పెంపకంపై నిషేధం లేదు..



ఎర్రచందనం పెంపకంపై ఎటువంటి నిషేధం లేదు. సాధారణ తోటల పెంపకంలా పెంచుకోవచ్చు. చెట్లు నరకడానికి సాధారణ చెట్లు వలే అనుమతి పొందాలి. వాటి కలపతో సొంత అవసరాలు, గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయడానికే మాత్రమే నిషేధిత నిబంధనలు ఉన్నాయి.

– ఎల్.రామారావు,ఫారెస్ట్ రేంజర్, పాలకొండ



పాలకొండ నర్సరీలో సిద్ధంగా ఉన్న ఎర్రచందనం మొక్కలు

ఆదర్శపాఠశాలకు పురుగుల బియ్యం





ప్రభుత్వం సరఫరా చేసిన 25 కేజీల బియ్యం ప్యాకెట్లు, (ఇన్‌సెట్లో) మోడల్ పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంలో సుంకి పురుగులు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలకు ప్రభుత్వం పురుగుల బియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాలలో సుమారు 480 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం ఇటీవల ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యం 25 కేజీల ప్యాకెట్లలో సుంకి పురుగులు ఉండడంతో వండేందుకు నిర్వాహకులు వెనుకంజవేస్తున్నారు. బియ్యంలో పురుగులు ఉన్న విషయాన్ని మండల పౌర సరఫరాల అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మార్చుతామని చెప్పారు.

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జ్యోత్స్న



వాకముల్ల జ్యోత్స్న



లలితకుమారి

రాజాం: రేషన్ డీలర్ల అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో రాజాం మండలానికి చెందిన ఇద్దరు మహిళా డీలర్లకు అవకాశం లభించింది. ఈ ఎన్నికల్లో రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా రాజాం మండలం అంతకాపల్లి డిపోకు చెందిన వాకముల్ల జ్యోత్స్న దేవి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శిగా రాజాం పట్టణంలని ఠాణావీధి డిపోకు చెందిన లలితాకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజాం డీలర్ల సంఘం మంగళవారం విలేకరులకు తెలిపింది. వారిద్దరిని రాజాం డీలర్ల అసోషియేషన్ అభినందించింది.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసచౌదరి

విజయనగరం టౌన్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా వై.శ్రీనివాసచౌదరి మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అసిస్టెంట్ కమిషనర్‌గా కృష్ణాజిల్లాలో పనిచేసి, పదోన్నతిపై ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఆయన బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు, సిబ్బంది శ్రీనివాస చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఒడిశా నుంచి వచ్చే రైళ్లలో తనిఖీలు

పార్వతీపురం రూరల్: రాయ్‌పూర్–విశాఖ పాసింజర్ ట్రైన్‌లో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనకు ఈగల్ టీం ఐజీ ఆకె రవికృష్ణ, ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం పేరిట మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈగల్ టీం, జిల్లా పోలీసు శాఖ, డాగ్ స్క్వాడ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టే ఉద్దేశ్యంతో ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో జనరల్ బోగీల నుంచి ఏసీ బోగీల వరకు ముమ్మరంగా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలనకు టోల్‌ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేశామని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ నంబర్ ద్వారా సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పలు శాఖల పోలీసు అధికారులతో పాటు డాగ్ స్క్వాడ్ బృందం, బీడీ బృందం సహాయంతో లగేజీలను, వ్యక్తులను తనిఖీలు చేశారు. తనిఖీల్లో పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి, డాగ్ స్క్వాడ్, బీడీ బృందం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఇంట్లో చోరీ

పార్వతీపురం రూరల్: పట్టణ పరిధి శివారు ప్రాంతంలో ఉన్న ఆశాజ్యోతి ఆశ్రమం సమీపంలో ఓ రైతు ఇంట్లో మంగళవారం చోరీ జరిగినట్లు పట్టణ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడిస్తూ ఆశాజ్యోతి ఆశ్రమం సమీపంలో నివాసం ఉంటున్న వంగపండు తిరుపతి రావు అనే వ్యక్తి భార్యతో కలిసి మంగళవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో పొలం పనుల నిమిత్తం వెళ్లి పనులు ముగించుకుని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉన్నట్లు గమనించారని, బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారంతో పాటు రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై జగదీష్ నాయుడు, సిబ్బంది

సుపరిపాలన తొలిఅడుగు విఫలం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గ్రామాల్లోకి కూటమి ప్రభుత్వ నాయకులు వెళ్లేటప్పుడు స్పందన కరువవడంతోనే ఈ కార్యక్రమం విఫలమైందన్నారు. ఈ మేరకు మంగళవారం రేగిడి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చకపోవడంతో గ్రామాల్లోకి వెళ్తున్న నాయకులను ప్రజలు నిలదీస్తుండడంతో నాయకులు కూడా ఈ కార్యక్రమంలో తూతూ మంత్రంగా పాల్గొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లోకి వెళ్లి నిర్వహిస్తుంటే ప్రజల నుంచి మంచి విశేష స్పందన వస్తోందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

2024 జనవరి నెలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త పింఛన్లు మంజూరుచేస్తే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరుచేయలేదని ఎద్దేవా చేశారు. కొత్త పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎదురు చూస్తున్నారని అన్నారు. తల్లికి వందనం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని కలెక్టర్ గ్రీవెన్స్‌కు వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం గమనించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, కెల్ల మన్మథరావు, కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

ఐదో సారి..!

- పత్తికాయవలస రేషన్ డీలర్ తొలగింపు
- నాలుగుసార్లు కోర్టు నుంచి అనుమతి
- తాజాగా ఐదోసారి అడ్డగోలుగా తొలగింపు
- ఎలాంటి నోటీసులు లేకుండానే డిపో స్వాధీనం
- కొనసాగుతున్న కూటమి కక్ష సాధింపు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుల పర్వం కొనసాగుతోంది. వారికి అనుకూలంగా లేకపోతే ఉద్యోగమైనా, ఉపాధి అయినా వేరే ఇంకేదైనా సరే వేటు తప్పడం లేదు. గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేయనక్కర్లేదు కూటమి నాయకులకు అనుమానం వస్తే చాలు తక్షణమే అలాంటి వారిపై వేటు పడుతోంది. మా ఊళ్లో మనకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. వాడు మనవాడు కాదు. ఒక్క చూపు చూడండని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తే చాలు. వెంటనే అక్కడి నుంచి అధికారులకు ఫోన్లు రావడం అధికారులు రంగప్రవేశం చేయడం ఏళ్ల తరబడి పని చేస్తున్న వారి పొట్ట కొట్టడం. దీనికి చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస గ్రామంలో రేషన్ డిపో ఉదంతం అద్దం పడుతోంది. అక్కడి రేషన్ డిపో డీలర్ నీలకంఠంను ఎలాగైనా తొలగించాలని కూటమి నేతలు కంకణం కట్టుకున్నారు. దీని కోసం కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచే చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగానే ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల కాలంలో ఇప్పటికి నాలుగుసార్లు ఆ డీలర్‌ను తొలగించగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుమతులు తెచ్చుకున్నాడు. అయినప్పటికీ శాంతించని నేతలు ఆదేశాల మేరకు అధికారులు మరోసారి సోమవారం వేటు వేశారు. దీంతో పత్తికాయవలస డీలర్ తొలగింపు లెక్క ఐదోసారికి చేరుకుంది. ఏడాదిలో ఐదుసార్లు తొలగించడం వెనుక రాజకీయ కక్ష ఉందని మరోసారి న్యాయ పోరాటం చేస్తానని డీలర్ నీలకంఠం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఎలాంటి నోటీసు లేకుండానే..

అధికార పార్టీ ఒత్తిళ్లతో తోనా? లేక మరింకేమైనా ఉందో గాని సోమవారం ఉదయం 11 గంటలకే పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది డీలర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పత్తికాయవలస రేషన్ డిపోకు వెళ్లారు. అక్కడ డీలర్ లేకుండానే డిపోకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న డీలర్ నీలకంఠం అక్కడికి చేరుకుని తనకు సమాచారం లేకుండా ఎలాంటి నోటీసు లేకుండా రేషన్ డిపోకు తాళం ఎలా వేస్తారని, తగిన కారణాలు చూపించి నోటీసులు ఇవ్వాలని ప్రశ్నించాడు. దీంతో సాయంత్రం తహసీల్దార్ ధర్మరాజు, పోలీసులు డిపో వద్దకు వెళ్లారు. రేషన్ డిపోను స్వాధీనం చేసుకుని లోపల ఉన్న సరుకులను వేరే గ్రామ డీలర్‌కు అప్పగించారు.

ఏడాదిలో ఐదు సార్లు తొలగింపు

ఇదిలా ఉండగా పత్తికాయవలస రేషన్ డిపో డీలర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐదు సార్లు తొలగించడం విశేషం. ఇంతవరకు నాలుగు సార్లు హైకోర్టును ఆశ్రయించి అనుమతులు తెచ్చుకుని డీలర్‌గా కొనసాగుతున్నాడు. 2025 ఫిబ్రవరిలో కూడా నాలుగో సారి హైకోర్టు నుంచి అనుమతులు తెచ్చుకున్నాడు.



సోమవారం రాత్రి పత్తికాయవలస రేషన్ డిపో వద్ద తహసీల్దార్, సీఎస్‌డీటీ, పోలీసులు



నోటీసు ఇవ్వకుండా డిపో ఎలా తరలిస్తున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న డీలర్ నీలకంఠం

నాపై కక్ష సాధింపు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నాపై కక్ష సాధింపు జరుగుతోంది. ఇప్పటికే ఐదుసార్లు ఎలాంటి కారణం లేకుండానే సస్పెన్షన్ విధించారు. నాలుగు సార్లు హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నాను. అయినప్పటికీ మళ్లీ నా పొట్టకొట్టేందుకు సిద్ధపడ్డారు. మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం కోసం పోరాటం చేస్తాను.

– నీలకంఠం, రేషన్ డిపో డీలర్, పత్తికాయవలస, చీపురుపల్లి మండలం

ఫిర్యాదు మేరకు చర్యలు

పత్తికాయవలస డీలర్‌పై పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు అందాయి. వృద్ధులు, దివ్యాంగుల వేలిముద్రలు వేయించుకుని సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై సీఎస్‌డీటీ నేతృత్వంలో విచారణ నిర్వహించాం. దీంతో పాటు డిపోలో సరుకుల నిల్వలో కూడా తేడాలు ఉన్నట్లు సీఎస్‌డీటీ, క్షేత్రస్థాయి అధికారులు గుర్తించి రిపోర్టు సమర్పించారు. దీనిపై విచారణ చేసి రేషన్ డిపో స్వాధీనం చేసుకుని పక్క గ్రామం డీలర్‌కు అప్పగించాం. పూర్తి నివేదికను ఆర్‌డీఓకు సమర్పిస్తున్నాం. ఆర్‌డీఓ నేతృత్వంలో తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

– డి.ధర్మరాజు, తహసీల్దార్, చీపురుపల్లి

అగ్రిగోల్డు భూముల మ్యుటేషన్ ప్రక్రియ పూర్తిచేయండి

- జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయగనరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అగ్రిగోల్డు భూముల మ్యుటేషన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అగ్రిగోల్డు భూములకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశం జేసీ చాంబర్‌లో మంగళవారం జరిగింది. రామభద్రపురం, మెంటాడ, గజపతినగరం, విజయనగరం మండలాల్లో ఉన్న అగ్రిగోల్డు సంస్థ ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే, భౌతిక పరిశీలనపై ఆరా తీశారు. మార్కెట్ విలువను లెక్కించి ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌కు సూచించారు. బుధవారం సాయంత్రంలోగా వ్యవసాయ భూముల మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. భూముల మ్యుటేషన్ పూర్తయిన తరువాత వేలం వేస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీఐడీ డీఎస్పీ ఎం.ఎస్.భూపాల్, నాలుగు మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల ప్రతినిధులు, సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

రోజుకో పంచలో పాఠశాల

- గోడు వెళ్లబోసినా పట్టించుకోని మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్:

మండలంలోని గంగన్న దొరవలస ప్రాథమిక పాఠశాలను రోజుకో పంచలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. పాఠశాల పాతభవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో కొత్తభవనం నిర్మాణానికి గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు చేశారు. అయితే అప్పట్లో పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికల కారణంగా మధ్యలో భవన నిర్మాణం నిలిచిపోవడంతో విద్యార్థులకు నీడలేకుండా పోయింది. నిర్మాణంలో ఉన్న భవనం పక్కన చిన్న రేకుల షెడ్డులో 1,2 తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే 3,4,5 తరగతులు గ్రామంలో ఎవరి గడప ఖాళీగా ఉంటే వారి గడపలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి ఏడాదిగా కొనసాగుతున్నా ఇంత వరకు కూటమి ప్రభుత్వం పాఠశాల భవనానికి నిధులు మంజూరై ఉన్నప్పటికీ పనులు కొనసాగించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తామని ఒక వైపు ఊకదంపు డు ప్రచారం చేస్తుంటే మరోవైపు గ్రామాల్లో విద్యార్థులకు నిలువ నీడలేకుండా పోతోంది.

మంత్రికి విన్నవించినా స్పందన శూన్యం

5 నుంచి పది సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులు తమకు విద్యాబోధనకు ఒక చిన్న భవనాన్ని నిర్మించండి. రోజుకో పంచలో మా చదువులు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితి ఏడాది కాలంగా జరుగుతోందని ఇటీవల కురుకూటి గ్రామంలో జరిగిన కూటమి ప్రభుత్వం తొలిఅడుగు సుపరిపాలన కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి సంధ్యారాణి కాన్వాయిని అడ్డుకుని గ్రామస్తులతో పాటు విద్యార్థులు విన్నవించుకున్నారు. అయితే ఆ సమయంలో వినతిపత్రం ఇస్తున్నట్లు సెల్‌ఫోన్‌లో తీసిన ఫొటోలను మంత్రి సంధ్యారాణి దగ్గరుండి మరీ తొలగించినట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. వినతి పత్రం ఇస్తున్నట్లు తీసిన ఫొటోలు తొలగించడంపై గ్రామంలో ఉన్న ఆ పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు.



మంత్రి కాన్వాయి వస్తుందని తెలిసి వినతిపత్రం ఇచ్చేందుకు రోడ్డుపై నిల్చున్న విద్యార్థులు(ఫైల్)